సాక్షి
చిత్తూరు
బుధవారం ၊ 10 ၊ జూలై ၊ 2024



‘ఉపాధి’ లక్ష్యాలు అధిగమించాలి

నిర్దేశిత ఉపాధి హామీ పథకం లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. - 8లో



24 గంటల్లోనే చోరీ కేసు ఛేదన!

చోరీ కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. - 8లో



హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల: తిరుమల శ్రీవారికి భక్తులు కానుకల రూపంలో హుండీలో రూ.3.78 కోట్లు సమర్పించారు.

న్యూస్‌రీల్

‘ఎన్నికల’ బాధితునికి సాయం

- వైఎస్సార్ సీపీ అండ



గణపతికి చెక్కు అందజేస్తున్న డాక్టర్ సుధీర్

కుప్పం: ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, సానుభూతిపరులను టార్గెట్ చేసి దాడులు చేయడం విదితమే. కుప్పం మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ గణపతిపై దాడి చేయడంతో ఆయనకు 12 కుట్లు పడ్డాయి. దాడి ఉదంతాన్ని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపేణా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ బాధితునికి అందజేశారు. దాడులు, దౌర్జన్యాలకు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు.

పాలిటెక్నిక్‌లో చేరేందుకు మరో అవకాశం

పలమనేరు: పాలిటెక్నిక్ రెండో విడత, చివరి విడత ప్రవేశాలకు ప్రకటన వెలువడిందని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మొహమూద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో ఇప్పటికే ర్యాంకులు పొంది సీట్లు రానివారు మళ్లీ వెబ్ ఆప్షన్లను పెట్టుకోవచ్చని తెలిపారు. ఇంకనూ సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోనివారు ఈనెల 11 నుంచి 13 దాకా చేసుకోవాలని, అలాగే 11 నుంచి 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు ఉంటుందన్నారు. ఈనెల 16న సీట్ల కేటాయింపు సమాచారం ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 18 నుంచి 20 లోపు ఫీజులు చెల్లించి కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని తెలియజేశారు. తమ కళాశాలలో అన్ని విభాగాల్లోనూ సీట్లు మిగిలి ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

68 మందికి డీఈఓ మెమోలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో పనిచేస్తున్న 68 మంది టీచర్లు, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు మంగళవారం డీఈఓ దేవరాజు మెమోలు జారీచేశారు. వాటిని డీవైఈఓ, ఎంఈఓలకు పంపారు. సక్రమంగా ఫేషియల్ అటెండెన్స్ వేయకుండా విధులకు డుమ్మా కొట్టడంతో మెమోలు జారీ చేసినట్లు తెలియజేశారు. జిల్లాలోని బైరెడ్డిపల్లెలో 4, బంగారుపాళ్యంలో 2, చిత్తూరులో 6, గంగాధరనెల్లూరులో 2, గంగవరంలో 3, గుడుపల్లెలో 5, పెద్దపంజాణిలో 5, కార్వేటినగరంలో 2, కుప్పంలో 8, నగరిలో 2, పలమనేరులో 2, వి.కోటలో 2, వెదురుకుప్పంలో 2, పుంగనూరులో 3, పూతలపట్టులో 4, రామకుప్పంలో 5, శాంతిపురంలో 4, సదుంలో 2, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు, ఎస్ఆర్‌పురం, తవణంపల్లె, విజయపురం మండలాల్లో ఒకరు చొప్పున మొత్తం 68 మందికి మెమోలు జారీచేసినట్లు వెల్లడించారు. వీరంతా 24 గంటలలోపు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు.

అసలే గద్దలు. ఆ గద్దలకు ‘అధికార’ రాబందు తోడయ్యింది. ఇంకేముంది. అన్నీ కలిసి ఆధ్యాత్మిక నగరంపై వాలిపోయాయి. కళ్లు మూసి తెరిచేలోపు రూ.100 కోట్ల విలువ చేసే దేవుడి మాన్యాన్ని అమాంతం మింగేశాయి. అభ్యంతరం చెప్పిన దేవదాయశాఖ సిబ్బందిపై దాడులకు తెగబడ్డాయి. బట్టలు విప్పి, మోకాళ్లపై కూర్చోబెట్టారు. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నానాబూతులు తిట్టి నిర్బంధించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నా ‘డోంట్ కేర్’ అంటూ వారి ఎదుటే... దేవుడి మాన్యానికి దర్జాగా కాంపౌండ్ వేశారు. ఇళ్ల స్థలాల కింద బహిరంగ మార్కెట్లో బేరం పెట్టేశారు. పోలీస్ స్టేషన్లో పంచాయితీ పెట్టిన దేవదాయ శాఖ అధికారులను పోలీసుల ఎదుటే కొట్టబోయారు. ‘నోరు మెదిపితే భూమ్మీద నూకలు చెల్లిపోతాయి’అంటూ బెదిరించారు. ఇదంతా ఎక్కడో మారుమూలున్న కొండల్లోనో గుట్టల్లోనో జరగలేదు. తిరుపతి నగర నడిబొడ్డున అందరూ చూస్తుండగానే జరిగిన సంఘటన ఇది.

తిరుపతిలో ల్యాండ్ మాఫియా

నాని.. ఆక్రమించుకున్న దేవుడి మాన్యం ఇదే



- రూ.100 కోట్ల భూమి హాంఫట్
- కొనసాగుతున్న నాని ఆక్రమణల పర్వం
- ‘నాని ఖాతా’లోకి మరో 3 ఎకరాలు
- మరో నాలుగు ఎకరాలపై కన్ను
- చిత్తూరులో మధ్యస్తంతో చంద్రగిరి ఎమ్మెల్యేకి రూ.52 కోట్లు
- దేవదాయ శాఖ సిబ్బంది బట్టలిప్పి మోకాళ్లపై కూర్చోబెట్టిన ‘చిత్తూరు గ్యాంగ్’
- ప్రాణభయంతో పోలీసులకు దేవదాయశాఖ ఫిర్యాదు
- అధికార పార్టీ నేతల తీరుపై సర్వత్రా విమర్శలు, ఆందోళనలకు సిద్ధం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి నగరంతోపాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో హథీరాంజీ మఠం భూములు ఉన్నాయి. వీటిని దేవుడి మాన్యం భూములుగా పరిగణిస్తారు. ఈ భూముల విషయమై తరచూ వివాదాలు నడుస్తుంటాయి. అలాగే తిరుపతి నడిబొడ్డున అటు అవిలాల, లింగేశ్వరనగర్, ఇటు బైరాగి పట్టెడ ప్రాంతాల నడుమ 145, 147/1 సర్వే నంబర్లలో 10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో మూడో వంతు భూమి హథీరాంజీ మఠం భూమి, నాలుగోవంతు భూమి పరకాల మఠం భూమి. దీనికి సంబంధించి అనేక డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. ఈ భూమి విలువ కనీసం రూ.100 కోట్లు కుపైమాటే. ఆ భూమి తమదంటూ ఎంకే.నాయుడు, సేతుమాధవ్, నరసింహారెడ్డి అనే వ్యక్తులు దానిని స్వాధీనం చేసుకోవడానికి తీవ్రంగా యత్నిస్తున్నారు. హథీరాంజీ మఠం ఆధీనంలో ఉన్న ఆ భూమిపై కోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో గత ప్రభుత్వంలోని అధికార పెద్దలెవ్వరూ వారికి సహకరించలేదు. దీంతో వారి ఆటలు సాగలేదు. సరిగ్గా నెల కిందట ప్రభుత్వం మారింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నాని ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక ఎంకే.నాయుడు, సేతుమాధవ్, నరసింహారెడ్డికి రెక్కలొచ్చాయి. ‘మాఫియా’ తమకు అండగా ‘చిత్తూరు గ్యాంగ్’ను అప్పటికే రంగంలోకి దింపింది. ఎలాగైనా ఆ భూమి స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు.

స్థానికులకు, పోలీసులకు చెరో రూ.50 లక్షలు

స్థానికంగా మూడు పంచాయతీల నుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో 50 మందిని భయపెట్టి తలకు రూ.లక్ష చొప్పున ఇచ్చి నోరు మూయించారు. అదే సమయంలో పోలీసులు సహకరించేందుకు రూ.50 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం.

మరో నాలుగు ఎకరాలపై కన్ను

ఈ భూమికి ఎదురుగానే మరో నాలుగు ఎకరాల హథీరాంజీ భూమి ఉంది. ఇందులో కంపచెట్లు నిండుగా ఉన్నాయి. వాటిని తొలగించి దానిని కూడా ఆక్రమించడానికి ల్యాండ్ మాఫియా సిద్ధమైపోతోంది. ఈ మేరకు ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నానీ పలువురికి తన తడాకా చూపించారు. తిరుపతి రూరల్‌లోని ఓ రైస్ మిల్లు మూయించకుండా ఉండడానికి రూ.2 కోట్లు ఇవ్వాలని బెదిరించారు. అతను రూ.50 లక్షలు ఇస్తామన్నా వినకుండా రైస్‌మిల్లుని మూయించారు. టీటీడీ కాంట్రాక్టరును బెదిరించి రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమిని రాయించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మరో మూడు ఎకరాల స్వాధీనం చేసుకున్నారు. ఇంకో నాలుగు ఎకరాలకు స్కెచ్ వేశారు. ఈ వ్యవహారాలను తిరుపతిలో ‘చిత్తూరు గ్యాంగ్’ సహకారంతో తన ఆక్రమణల పరంపరను నాని కొనసాగిస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లోనూ రెచ్చిపోయిన ‘మాఫియా’

చూస్తూ.. చూస్తూ అంత విలువైన భూమి దురాక్రమణకు గురికాకుండా చూడాలనే ఉద్దేశంతో మఠం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పైగా తమకు ఆ ‘మాఫియా’ వలన ప్రాణాపాయం ఉందని, తమను నిర్బంధించి మోకాళ్లపై నిల్చోబెట్టారని జరిగిన తతంగాన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై చంద్రగిరి డీఎస్పీ జూన్ 11న ‘మాఫియా’ సభ్యులను, దేవదాయ శాఖ అధికారులను అక్కడకు పిలిపించుకున్నారు. మాఫియా సభ్యులు అక్కడ కూడా దేవదాయ శాఖ అధికారులపై తిట్ల పురాణం అందుకున్నారు. ఓ దశలో అధికారులపై దాడి చేయబోయారు. ‘ప్రభుత్వం మాది, ఎమ్మెల్యే మా నాని అన్న’, ‘మేము చెప్పిందే జరుగుతుంది, జరగాలి’ ‘ఆ భూమి మాది, దేవుడి మాన్యం, మఠం భూములంటే తంతాం.. నీ దిక్కున్న చోట చెప్పుకో... కాదంటే నీవు ఎక్కడ పని చేస్తావో మేమూ చూస్తాం.’ అంటూ అధికారులపై మరళా విరుచుకుపడ్డారు. ఇదంతా పోలీసుల ఎదుటే జరిగింది. ‘మాఫియా’, ‘చిత్తూరు గ్యాంగ్’పై దేవదాయ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటి వరకూ అతీగతీ లేదు. కనీసం ఎఫ్ఐఆర్ కట్టలేదు. ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు.

ఒకే డీల్.. నానికి రూ.52 కోట్లు

ఒప్పందంలో భాగంగా ఉచితంగా తీసుకున్న మూడెకరాలకు రూ.30 కోట్లు, అభివృద్ధి కింద తీసుకున్న ఏడెకరాల్లో తన వాటా కింద రూ.22 కోట్లు.. మొత్తం ఒకే డీల్‌తో నాని ఖాతాల్లోకి రూ.52 కోట్లు జమచేసుకోనున్నారు. పులివెందులకు చెందిన నవీన్ అనే వ్యక్తిని భాగస్వామిగా చేర్చుకుని ఆ భూమిని పక్కా ప్రణాళికతో ప్రహరీలోపల గుట్టుచప్పుడు కాకుండా పాట్లు వేసి అమ్మేస్తున్నారు. అంకణం స్థలం రూ.1.5 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు.

అధికారపార్టీ నేతల దౌర్జన్యాలను చూస్తున్న స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇందుకేనా టీడీపీకి ఓటేసిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. దేవుని భూములను కూడా వదలరా? అంటూ మండిపడుతున్నారు. తిరుపతి నడిబొడ్డున ఇంత దురాక్రమణ జరుగుతుంటే కూటమిలోని పార్టీలు, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు ఏం చేస్తున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలా దౌర్జన్యాలు, ఆక్రమణలు కొనసాగితే ఆందోళనలకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

పనులు ప్రారంభం

జూన్ 9 తేదీన ఉదయం 7 గంటలకు ఆ భూమి చుట్టూ ప్రహరీ గోడ వేయడానికి పనులు ప్రారంభించారు. ఆలస్యంగా సమాచారం అందుకున్న దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది అందరూ కలిసి అదే నెల 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఓ ఆరుగురు ఆ స్థలం వద్దకెళ్లి ప్రహరీ నిర్మించడానికి వీల్లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడ 100 మందికిపైగా చిత్తూరు గూండాలు కాపుకాస్తున్నారు. ‘మేమెవరో తెలియదా?, ఎంత ధైర్యం ఉంటే ఇక్కడికి వస్తావ్?, నాని అన్న అంటే భయం లేదా?, మేము మీకు ప్రత్యేకంగా బొట్టు పెట్టి చెప్పాలా? ఎలా వచ్చారో? అలాగే ... మూసుకుని వెళ్లండి’ అంటూ బెదిరింపులకు దిగారు. అయినా మఠం అధికారులు కుదరదు, ఇది మఠం భూమి.. పనులు ఆపాల్సిందేనంటూ గట్టిగా వాదించారు. కోపోద్రిక్తులైన చిత్తూరు గ్యాంగ్ మఠం సిబ్బందిని తాత్కాలికంగా నిర్మించుకున్న గదిలోకి తీసుకెళ్లి బట్టలు ఊడదీయించారు. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నోటికొచ్చినట్లు బండ బూతులు తిట్టారు. సుమారు మూడు గంటల పాటు ప్రాణభయంతో అక్కడే బిక్కుబిక్కుమంటూ గడిపారు. చివరకు చిత్తూరు గ్యాంగ్ కాళ్లావేళ్లా పడి బతుకుజీవుడా అంటూ అక్కడి నుంచి మఠం కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జరిగిన విషయాలను మఠం పరిపాలనాధికారికి వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ తతంగమంతా ఎమ్మార్ పల్లె పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో చోటు చేసుకుంది. ఇంత జరుగుతున్నా పోలీసులు తమను కాపాడలేదని కన్నీరుపెట్టుకున్నారు.



ఆక్రమిత స్థలంలో దర్జాగా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్

నాకు మూడు, మీకు ఏడెకరాలు.. ఇదీ నాని ఫిక్సింగ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాని రంగంలోకి దిగారు. ఎంకే నాయుడు, నరసింహారెడ్డి, సేతమాధవ్‌ని ఆ నాయకుడు చిత్తూరుకి పిలిపించారు. తనకు మూడెకరాలు కేటాయిస్తే, ముగ్గురికి ఏడెకరాలు తీసుకోమని హుకుం జారీ చేశారు. ఈ భూమికి సంబంధించి మఠం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందీ రాకుండా తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. అంతటితో ఆగని చంద్రగిరి ఎమ్మెల్యే నాని.. ఆ ఏడెకరాలను తానే కొనుగోలు చేసుకుంటానని చెప్పడంతో ఆ ముగ్గురు షాక్ అయ్యారు. ఆ ఏడెకరాలకు రూ.25 కోట్లు చెల్లిస్తానని, ఆ నగదుని ముగ్గురు పంచుకోమని స్పష్టం చేశారు. చేసేదేమీ లేక ముగ్గురూ తెల్లముఖం వేశారు. ఒక్కదెబ్బతో పదెకరాల నుంచి అధికారపార్టీ నేతకు రూ.52 కోట్లు రాబట్టుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఈ మొత్తంలో అమరావతిలోని మరో ముఖ్యనేత వాటా ఇవ్వాలని చెప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

హైవేలలో మృత్యు శకటాలు

- ట్రాలీ వెనుక రెడ్‌లైట్, రేడియం స్టిక్కర్లు లేకుండా వెళుతున్న ట్రాక్టర్లు
- వెనుకవచ్చే వాహనాలకు ట్రాక్టర్లు కనిపించక రాత్రిపూట ప్రమాదాలు
- అధికారులు అవగాహన కల్పించినా ఫలితం శూన్యం

పలమనేరు: చెన్నై–బెంగళూరు, అనంతపూర్–క్రిష్ణగిరి హైవేలో రాత్రిపూట రోడ్డుపై వెళ్లే ట్రాక్టర్ల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత నెల స్థానిక హైవేలో ట్రాక్టర్ల కారణంగా సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు మోటార్ సైక్లిస్టులు గాయపడ్డారు. ప్రధానంగా ఈ ట్రాక్టర్ల ట్రాలీలకు వెనుకవైపు రెడ్ లైట్లు, రేడియం స్టిక్కర్లు లేకపోవడం మూలాన వెనుక వచ్చే వాహనాలకు ట్రాక్టర్ కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో మామిడి సీజన్ సాగుతోంది. రైతులు మామిడి కాయలను ట్రాక్టర్లలో బంగారుపాళెం, పూతలపట్టు, వేలూరు, కాణిపాకం, మదనపల్లె, హోస్‌కోటకు ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దాదాపు 200 పైచిలుకు ట్రాక్టర్లు రాత్రి పూట మామిడి కాయల లోడుతో వెళ్తున్నాయి. వీటిని పరిశీలించినప్పుడు చాలావరకు ట్రాక్టర్లు రెడ్‌లైట్లు, రేడియం స్టిక్కర్లు లేకుండా వెళ్తుండటం గమనార్హం!

హైవేలో వాహనాల దూకుడు

జిల్లాలోని చెన్నై–బెంగళూరు, క్రిష్ణగిరి–అనంతపూర్ హైవేలు వేశాక రవాణా సౌకర్యం విస్తృతి పెరిగింది. ఈ మార్గాల్లో కార్లలో గరిష్ఠ వేగం వందకు దాటింది. కొన్ని కంపెనీల కార్లు గంటకు 150 నుంచి 180 కిలోమీటర్ల వేగంలో ఈ హైవేలలో దూసుకెళ్తున్నాయి. అలాగే అధిక సామర్థ్యం కలిగిన పలు రకాల బైక్‌లు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. దీనికి తోడు సినిమాలు, టీవీల ప్రభావంతో యువత మోటార్‌బైక్‌ల వైపు ఆసక్తి పెంచుకుంటోంది. దీనికి తోడు కనీసం హెల్మెట్లు కూడా ధరించడం లేదు. ఇక కార్లలో అయితే సీట్‌బెల్టు ధరించాలని అధికారులు చెబుతున్నా, కారులోనూ అలెర్ట్‌లు వస్తున్నా యువత పట్టించుకోవడం లేదు. ఫలితంగా వేగంగా వెళ్లే వాహనాలు ముందున్న కనిపించని ట్రాక్టర్‌ను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయి.



పలమనేరు సమీపంలోని హైవేలో రేడియం స్టిక్కర్ లేకుండా రాత్రిపూట వెళుతున్న ట్రాక్టర్లు

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

ఉమ్మడి జిల్లాకు సంబంధించి 2023లో 711 రోడ్డు ప్రమాదాలు సంభవించి 366మంది మృతి చెందగా 799మంది గాయపడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ప్రమాదాల్లో 220 కార్లు కాగా, 229 ద్విచక్రవాహనాలు,103 లారీలు, 55 ట్రాక్టర్లు, 34 ఆటోలు, 30 ఆర్టీసీ బస్సులు, 16 ప్రైవేటు మినీబస్సులు, 19 గుర్తు తెలియని వాహనాలు, మరో ఐదు ఇతర వాహనాలుగా ఉన్నాయి. ఈ గణాంకాలను చూస్తే ప్రమాదాలకు గురైన వాటిల్లో ఎక్కువగా కార్లు, బైక్‌లు ఉంటున్నాయి.

రేడియం స్టిక్కర్ లేకపోతే ట్రాక్టర్లు సీజ్



హైవేలపై వెళ్లే ట్రాక్టర్ల డ్రైవర్లకు రవాణా, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించాం. రేడియం స్టిక్కర్లను మేమే అంటించాం. కానీ కొందరు ట్రాక్టర్ యజమానులు రేడియం స్టిక్కర్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ కాబట్టి హైవేలో వెళ్లే ట్రాక్టర్ ట్రాలీలకు కచ్చితంగా రేడియం స్టిక్కర్ ఉండాల్సిందే. దీనిపై మరింత అవగాహన కల్పిస్తాం. ఆపై స్టిక్కర్ లేని వాహనాలను సీజ్ చేస్తాం.

– మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు

క్లుప్తంగా

మున్సిపల్ టీచర్ ఆత్మహత్య


షరీఫ్

చిత్తూరు అర్బన్: మున్సిపల్ స్కూల్ టీచర్ ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ ఎస్ఐ ప్రసాద్ కథనం.. గిరింపేట మున్సిపల్ హైస్కూల్లో షరీఫ్(38) హిందీ పండిట్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి పెళ్లి అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుర్గా నగర్ కాలనీలో కాపురం ఉంటున్నాడు. సోమవారం పాఠశాలలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. కొంత సేపటికి ఇంటి నుంచి వచ్చి ఓ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేశాడు. దిశా పోలీస్ స్టేషన్ సమీపంలో పురుగులు మందు తాగి కింద పడిపోయాడు. స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఇతన్ని వేలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలేమిటో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

కులం పేరిట దూషణ.. నిందితునికి జైలు

చిత్తూరు అర్బన్: కులం పేరిట దూషించిన వ్యక్తికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోకనాథరెడ్డి కథనం.. బంగారుపాళెం మండలానికి చెందిన దాము , మధుకు పాత గొడవలు ఉన్నాయి. 2014 జూన్‌లో దాము ఇంటికి వెళ్లిన మధు దాడి చేసి గాయపరిచాడు. అంతేకాకుండా కులం పేరిట దూషించాడు. బాధితుడు ఆసుపత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మధుపై అట్రాసిటీ కేసు నమోదు చేసిన బంగారుపాళెం పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి రమేష్ తీర్పునిచ్చారు.

శిక్షణ నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు శిక్షణ నైపుణ్యాలను మరింత మెరుగు పరచుకుని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి ఆకాంక్షించారు. మంగళవారం ఆ కళాశాలలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించి ఆమె మాట్లాడారు. నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల డిగ్రీ పూర్తికాగానే ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. అనంతరం బీకాం కంప్యూటర్ అప్లికేషన్ 4వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు సత్వ ఇన్ఫోటెక్ అందజేసిన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ అప్లికేషన్ అధ్యాపకులు శరవణ, నాక్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్, జేకేసీ సమన్వయకర్త బాబు, వైస్ ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

‘దేశం’లో అంతర్యుద్ధం!

- చిత్తూరు టీడీపీలో సరికొత్త ‘ముసలం’
- పార్టీలో చేరిన కార్పొరేటర్లతో పొసగని వైనం
- ఆగ్రహంతో రగిలిపోతున్న టీడీపీ సీనియర్లు
- పార్టీలో భారీ చేరికలతో ఎసరు తప్పదనే ఆందోళన
- ఆత్మీయ సమావేశంలో నేతల ఎదుటే అసంతృప్తి


వైఎస్సార్‌సీపీ వారికి పచ్చ కండువాలతో పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు తెలుగుదేశం పార్టీలో సరికొత్త సమస్య ఆ పార్టీ నేతలకు కంటికి కునుకు లేకుండా చేస్తోంది. ఐదేళ్ల తరువాత అధికారం వచ్చింది కదా అని ఊహల పల్లకిలో భవిష్యత్తు కలలు కంటున్న వారికి పెద్ద ఉపద్రవం వచ్చి పడింది. అది కూడా ఒకటీ, రెండూ కాదు.. ఏకంగా 24 మంది రూపంలో వచ్చి పడిందాయె..! దీంతో తమ కలలు కల్లలవుతాయేమోనని ద్వితీయశ్రేణి నేతలు గగ్గోలు పెడుతున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఇదే విషయాన్ని లేవనెత్తి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. అయితే నాయకులు తాత్కాలికంగా సర్దిచెప్పినప్పటికీ వ్యవహారం ఇంతటితో ముగిసేలా కనిపించడం లేదు. మున్ముందు పార్టీలో అంతర్యుద్ధం తప్పదనడానికి ఇది నాంది పలికినట్టైంది.

వారితోనే ఉపద్రవం

వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఒక్కసారిగా 16 మందిని చేర్చుకోవడాన్ని టీడీపీలోని కొందరు నాయకులు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది పార్టీలోని కొందరు సీనియర్లను పక్కకుపెట్టడంతోపాటు తనదైన ముద్రను చూపించడానికే ఇలా సంకేతాలు ఇచ్చినట్లు తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. దీనికితోడు వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన జంప్ జిలానీలతో తమ ఉనికికే ముప్పు వాటిల్లుతోందని..ఇప్పటికే అక్కడ ఉన్న వార్డు ఇన్‌చార్జ్‌లు అసంతృప్తితో రగిలిపోతున్నారు. గత ఐదేళ్లుగా తాము ఎవరితో అయితే రాజకీయ యుద్ధం చేశామో.. వాళ్లనే తమకు మేకై తీసుకొచ్చి పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని లోలోపల కుతకుతమని ఉడికిపోతున్నారు!. పరిస్థితి చేయి దాటకముందే అసంతృప్తులను చల్లబరచాలని రెండు రోజుల క్రితం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం పేరిట కార్పొరేషన్‌లోని 50 డివిజన్ల ఇన్‌చార్జ్‌లను పిలిపించి సమావేశం నిర్వహించారు. ఇందులో పలువురు నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ వారిని పార్టీలోకి చేర్చుకోవడంతో తమ ఉనికికే ఎసరు పెట్టేలా కనిపిస్తోందని బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ వరకే వాళ్లు ఉంటారని, ఇప్పటికే ఉన్న టీడీపీ ఇన్‌చార్జులు చెప్పిన పనులకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సర్దిచెప్పినా లోలోపల మాత్రం అసంతృప్త నాయకులు, కార్యకర్తలు కత్తులు దూస్తున్నారు. చిత్తూరులోని ముగ్గురు సీనియర్ నాయకులు తమ అనుచర గణాన్ని ఈ సమావేశానికి పంపించి, ఎమ్మెల్యేను నిలదీయాలని చెప్పినట్లు ఆజ్యం పోసి వేడుక చూసారనే ఊహాగానాలు గుప్పుమంటున్నాయి.

‘చెక్’ పెట్టడమే లక్ష్యం..?

గత నెల వెలువడ్డ సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో జిల్లా కేంద్రంలో ఎవరూ ఊహించని ఫలితాలు ఆ పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఎన్నికలకు ముందు మహా ఉద్దండులు, పార్టీకి విధేయులుగా ఉన్న నేతలు చిత్తూరు టికెట్టు కోసం ఆశించి భంగపడ్డారు. అయితే ఆర్థికంగా బలమైన వ్యక్తిగా ఉన్న జగన్‌మోహన్ నాయుడుకు అధిష్టానం టికెట్టు ఖరారు చేసింది. ఇంతటితో జగన్‌మోహన్ ఆగిపోలేదు. ఎవరైతే టికెట్లు ఆశించి భంగపడ్డారో వారందరినీ కలుపుకుని వ్యూహాత్మక పావులతో చిత్తూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వాస్తవానికి ఈ ఫలితం ఆ పార్టీలోనే కొందరు నేతలకు మింగుడు పడలేదన్నది జగన్‌మోహన్‌కు సైతం తెలుసు. గెలిచిన అనంతరం పార్టీని చక్కబెట్టడంపై దృష్టి పెట్టిన ఆయన.. పార్టీలో ఉంటూ, వెన్నుపోటు పొడిచిన వాళ్లను పక్కన పెట్టే ప్రయత్నానికి పూనుకున్నారు. పార్టీకి ద్రోహం చేసినవాళ్లను బయటకు వెళ్లమని చెప్పకుండా.. వైఎస్సార్ సీపీ నుంచి కొందరిని టీడీపీలోకి తెప్పించుకోవడంపై దృష్టి సారించి కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు 16 మంది కార్పొరేటర్లను (దానికి ముందే కొందరు జనసేన, టీడీపీలో చేరారు) తనవైపు తిప్పుకున్నారు. వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పైకి ఇది వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు చెప్పుకుంటున్నా.. తనను కాదన్న వాళ్లకు చెక్ పెట్టడమే అసలు విషయమనే ఊహాగానాలు జోరందుకున్నాయి.

వీళ్ల పరిస్థితేమిటో..?

- 39వ డివిజన్ పరిధిలోని పెద్ద హరిజనవాడ నుంచి మాజీ కార్పొరేటర్ రాణి దాదాపు 12 ఏళ్లుగా టీడీపీలో ఉన్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తానున్నాననే ధైర్యాన్ని నింపి అండగా నిలిచారు. కానీ ఇప్పుడు తనను ఏమాత్రం సంప్రదించకుండా తన రాజకీయ శత్రువు, మేయర్ అముదకు పార్టీలో అందల మెక్కించారని ఆమె రగిలిపోతున్నట్టు తెలిసింది. వచ్చే మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ తనకు సీటు విషయంలో ఎలాంటి హామీ ఇవ్వకపోవడంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.
- కొండమిట్టలో మాజీ కార్పొరేటర్ భర్త ఆనంద్ టీడీపీలో 15 ఏళ్లుగా క్రియాశీలకంగా ఉన్నాడు. నాటి టీడీపీ ప్రభుత్వంతో ఇతని స్నేహితుడి పేరిట డీఈఓ కార్యాలయం ఎదుట స్థలాన్ని లీజుకు తీసుకుని దుకాణాలు కట్టుకున్నాడు. లీజును రద్దు చేసి, ఆనంద్‌ను నడిరోడ్డున నిలబెట్టడానికి ప్రయత్నించిన దాడి మున్నాను పార్టీలో చేర్చుకోవడం వీరి మధ్య అగ్గిని రాజేసింది.
- కట్టెలదొడ్డికి చెందిన టీడీపీ మాజీ కార్పొరేటర్ శివకుమార్ రెండు రోజుల క్రితం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తన ఆవేదన వ్యక్తం చేస్తూ.. ‘మాపై రౌడీషీట్లు, పీడీ యాక్టులు పెట్టడానికి ఎవరు కారణమో వాళ్లను పార్టీలో చేర్చుకుంటే ఎట్లా.? అంటే మేము ఇక అవసరం లేదా..!’’ అని ప్రశ్నించినట్లు తెలిసింది.
- బండపల్లె, తేనబండ ప్రాంతాల్లో ఎమ్మెల్యేకు తెలియకుండానే పార్టీలోని సీనియర్లను కాదని రేషన్ దుకాణాలను ఇపుడు పార్టీలో చేరిన వాళ్లకు అప్పగించినట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. మరో ఆరుగురు గాయపడ్డారు.

- ఆటోను ట్రక్కు ఢీకొని ఇద్దరు మహిళలు..
- కర్ణాటక బస్సు ఢీకొని మరో వ్యక్తి..


మృతురాలు అంజమ్మ


మృతురాలు లక్ష్మి


ట్రక్కు ఢీకొనడంతో ధ్వంసమైన ఆటో

రొంపిచెర్ల: ఆటోను ట్రక్కు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మరణించారు. మరో ఆరుగురు గాయపడ్డారు. సోమవారం రాత్రి ఈ సంఘటన తిరుపతి–మదనపల్లె రహదారిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మధు కథనం..కర్నూలు జిల్లా కోసిగి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు దాదాపు 50మంది ఏడాది నుంచి ఇక్కడ కూలీలుగా జాతీయ రహదారి పనులు చేస్తున్నారు. వీరికి హైవే పనుల యాజమాన్యం మేకలవారిపల్లె వద్ద రేకులషెడ్లు ఏర్పాటు చేసి నివాసం కల్పించింది. సోమవారం సాయంత్రం పనులు ముగించుకుని ఆటోలో మేకలవారిపల్లెకు కర్నూలు వాసులు వెళుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న ట్రక్కు రొంపిచెర్ల క్రాస్ రోడ్డు సమీపంలోని మోడల్ స్కూల్ ఎదురుగా ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో అంజమ్మ(40), లక్ష్మి(18) అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే మల్లిక, అయ్యప్ప, ఉరుకుందమ్మ, చంద్ర, నరసింహ, ఈరమ్మ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అన్నమ్మయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తిరుపతికి చెందిన ట్రక్కు డ్రైవర్ విజయకుమార్(38)ను అరెస్ట్ చేశారు.

కర్ణాటక బస్సు ఢీకొని..

గంగాధరనెల్లూరు: కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం మండలంలోని వేపంజేరి పంచాయతీ 400 కేవీ సబ్ స్టేషన్ ఎదురుగా చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. ముసలయ్యగారిపల్లెకు చెందిన పద్మనాభరెడ్డి (55) జీడీ నెల్లూరు నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో మృత్యువాత పడ్డాడు. బలిజ కండ్రిగ నుంచి బెంగళూరుకు వెళుతున్న కర్ణాటక బస్సు అతడిని సబ్ స్టేషన్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బస్సు ఢీకొని మృతి చెందిన పద్మనాభ రెడ్డి

‘ఉపాధి’ లక్ష్యాలు అధిగమించాలి

- మొక్కల నాణ్యత పరిశీలనకు ఉమ్మడి తనిఖీ
- సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డ్వామా శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం ఉన్న వాటిపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పనిదినాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఫారంపాండ్స్, ఫీడర్ ఛానల్, అమృత్ సరోవర్, రోడ్డు ఫార్మేషన్, సప్లై ఛానల్ హార్టికల్చర్, ట్రెంచ్ పనులు, బౌండరీస్ తదితర పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో మొక్కల నాణ్యతను పరిశీలించేందుకు మండల స్థాయిలో ఉద్యానవన శాఖ అధికారి, ఉపాధి హామీ అధికారులు సంయుక్తంగా నర్సరీలను తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో మ్యాంగో ప్లాంటేషన్ ఎక్కువ ఉండడంతో ఆ మొక్కల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్లస్టర్ల వారీగా పనులలో లేబర్ మొబలైజేషన్ ఎక్కువగా ఉండాలన్నారు. క్లస్టర్ల వారీగా మరో పది రోజులకు నిర్దేశించిన పనిదినాలను కచ్చితంగా చేరుకోవాలన్నారు. జిల్లాలో జూలై వరకు 40 లక్షల పనిదినాల లక్ష్యంలో ఇప్పటి వరకు 26,43,361 పనిదినాలు కల్పిస్తూ 66 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్టు చెప్పారు. జూలైలో 16 లక్షల పనిదినాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహించే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సమీక్షలో డ్వామా పీడీ రాజశేఖర్, ఏపీడీ, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సర్వేయర్ల సమస్యలు


సర్వేయర్ల సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తున్న మంజుల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సర్వేయర్లు తమ సమస్యలపై మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ, విలేజ్ సర్వేయర్లకు గ్రేడ్ 1 ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్లు సకాలంలో మంజూరు చేయాలని కోరారు. తాము నివేదించిన సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దిలీప్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లోనే చోరీ కేసు ఛేదన!

- నిందితుడి అరెస్ట్
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం
- పోలీసులకు రివార్డు ప్రకటించిన జిల్లా ఎస్పీ


నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐ

కార్వేటినగరం: చోరీ కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ సత్యబాబు కార్యాలయంలో డీఎస్పీ ఎంఎస్ మూర్తి తెలిపిన వివరాలు..స్థానిక ముస్లిం కాలనీ కాలనీకి చెందిన మహబూబ్ బాషా తమ కుటుంబ సభ్యులతో పీలేరులోని తమ సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. 7వ తేదీన అతడి ఇంట దొంగలు పడ్డారు. తిరిగి ఇంటికి చేరుకున్నాక బాషా దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ తన సిబ్బందితో కలసి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. దీంతో అదే కాలనీలోని పాత సంతవీధికి చెందిన డీ.ఖాదర్‌బాషా కుమారుడు ఢంకా జాఫర్(30)పై అనుమానించి మంగళవారం చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి సమీపంలోని బంగారమ్మ ఆలయం వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేసేసరికి..పట్టపగలే అతడు ఇంటి తాళాలు కొట్టి, బెడ్ రూంలోకి వెళ్లి అక్కడ బీరువాను సైతం పగల గొట్టి, అందులోని రూ. 5.40 లక్షల నగదు, 176 గ్రాములు బంగారం ఆభరణాలు, అర కేజీ వెండి ఆభరణాలను చోరీ చేసినట్లు తేలింది. నిందితుడి నుంచి ఇవన్నీ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో చోరీ కేసును ఛేదించినందుకు సీఐతోపాటు సిబ్బంది గవాస్కర్, భాస్కర్, రాజశేఖర్‌ను అభినందిస్తూ జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ రివార్డులు ప్రకటించారు.

దాడి కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు

చిత్తూరు అర్బన్: వ్యక్తిపై దాడి చేసి డబ్బులు లాక్కున్న ఘటనలో ముగ్గురు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరులోని న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కథనం.. కేరళలోని ఎర్నాకులంకు చెందిన ఆసిన్ అనే వ్యక్తి తిరుపతిలో మొబైల్ షాప్ పరికరాలు విక్రయిస్తూ జీవించేవాడు. గత ఏడాది అక్టోబర్ 11న అలిపిరి బస్టాండ్ వద్ద ఉన్న ఆసిన్‌పై ముగ్గురు ఆగంతకులు దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.13 వేల నగదు, రూ. 4 వేల విలువచేసే మొబైల్ పరికరాలను లాక్కెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు . దాడికి పాల్పడింది తమిళనాడుకు చెందిన రాజా, తిరుపతి, షాజహాన్‌గా గుర్తించారు. ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి వెన్నెల తీర్పునిచ్చారు.

పక్కాగా ఏటీఎం దోపిడీ

- బిహార్ ముఠా పనేనా?
- బెంగళూరులో కారు అపహరించి.. అదే కారులో ఇక్కడికొచ్చి..!

గుడిపాల: స్థానిక చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారిలోని ఎస్‌బీఐ ఏటీఎంను ఆదివారం కొల్లగొట్టింది ఇతర రాష్ట్రాల ముఠాల పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్యాస్ కట్టర్‌తో చాకచక్యంగా ఏటీఎం మెషిన్‌ను పగులగొట్టి నగదు దోచుకుపోవడం.. ఏటీఎం మెషిన్‌లోని సీసీ ఫుటేజీ ఆధారంగా వీరంతా ఉత్తరాదికి చెందిన వారని పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా బెంగళూరులో కారు చోరీ చేసి, అదే కారులో ఇక్కడికి వచ్చి, ఏటీఎంలోని సొమ్మును కొల్లగొట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆదివారం తెల్లవారుజామున 3:45 నుంచి 4:5 గంటల మధ్యలో ఈ చోరీని పక్కాగా స్కెచ్ వేసి చేశారు. ఏటీఎం మెషిన్ వద్ద కారు ఆపి, అందులోంచి గ్యాస్‌కట్టర్లు దించి, కారు వెనక్కు వచ్చినట్లు గుర్తించారు. రెండు ఏటీఎం మెషిన్లలో సుమారు రూ.26లక్షల వరకు చోరీ చేశారు.

గుడిపాలకు వచ్చిన కర్ణాటక పోలీసులు

కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపూర్‌లో గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను దుండగులు పగులగొట్టారు. అదే రోజు అలాగే గుడిపాలలో కూడా ఏటీఎంను పగలగొట్టి చోరీ ఘటన చోటుచేసుకోవడంతో మంగళవారం కర్ణాటక పోలీసులు ఇక్కడికి వచ్చారు. ఎస్‌బీ ఏటీఎం ప్రదేశాన్ని పరిశీలించారు.

తమిళనాడుకు వెళ్లిన డీఎస్పీ, సీఐ

తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ రవిశంకర్‌రెడ్డిలతో పాటు సిబ్బంది వెళ్లారు. ఏటీఎంలో చోరీ ఉదంతాలపై అక్కడి పోలీసులతో చర్చించారు. తమవంతు సహకారాన్ని పూర్తిగా అందజేస్తామని అక్కడి పోలీసులు తెలియజేసినట్లు సమాచారం.


ఏటీఎం మెషిన్‌లో గ్యాస్ సిలిండర్, కట్టర్లతో చోరీకి పాల్పడిన దొంగల ముఠా

సీసీ కెమెరాలు పని చేయకపోవడమే ప్రధాన కారణం!

గుడిపాలలో చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారిలోనే కాకుండా చీలాపల్లె క్రాస్, నరహరిపేటలో కూడా సీసీ కెమెరాలు ఉన్నాయి. అవేవీ పనిచేయకపోవడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. ఇక్కడ అధికసంఖ్యలో వానరాలు బెడద ఉండడంతో తరచూ కెమెరాలు పనిచేయడం లేదు.

ఆ ముఠా పనేనా?

2023 ఏప్రిల్ 5న మండలంలో ఇద్దరు ఆగంతకులు బైక్‌లో వచ్చి కారు దిగుతున్న దంపతులను బెదిరించి సుమారు 1.5 కేజీల బంగారాన్ని దోచుకువెళ్లారు. ఆ తర్వాత కొన్నిరోజులకే ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి విఫల యత్నం చేసి వెనుదిరిగారు. ఈ పరిణామాల క్రమంలో అప్పట్లో చోరీకి యత్నించిన వారే ఇప్పుడు పక్కాగా స్కెచ్ వేసి ఏటీఎంలలో రూ.26లక్షలు కొల్లగొట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బంగారు, నగలు చోరీ


పత్రపల్లెలో చోరీ జరిగిన ఇంటిలో బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ అనిల్‌కుమార్

తవణంపల్లె: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి బంగారు, నగదు చోరీ చేసిన సంఘటన మంగళవారం పత్రపల్లెలో వెలుగులోకి వచ్చింది. తవణంపల్లె ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం... పత్రపల్లెకు చెందిన గుర్రప్ప తన భార్యతో కలసి సోమవారం తమ పొలం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. రాత్రి భోజనం చేసి నిద్రించారు. మంగళవారం ఉదయం గుర్రప్ప ఇంటిలోని బీరువా తాళాలు తీసి చూస్తే అందులో సుమారు 9 సవర్ల బంగారు నగలు, నగదు కనపడకపోవడంతో హతాశులయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిత్తూరు నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానంతోనే.. గొంతుకోసి హత్య

- వీడిన నిమ్మనపల్లె మహిళ హత్య కేసు మిస్టరీ
- భార్యను కిరాతకంగా చంపిన భర్త అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె(అన్నమయ్య జిల్లా): మగవారితో చనువుగా మాట్లాడుతోందని.. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భార్య గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె వ్యవసాయ పొలాల్లో జూన్ 27న జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను డీఎస్పీ ప్రసాదరెడ్డి మంగళవారం వెల్లడించారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని నాగరాళ్లవీధికి చెందిన పి.మునిరత్నం కుమారుడు పి.గణపతి(37) అలియాస్ వెంకటేష్‌కు అదే జిల్లా పెనుమూరు మండలం కార్తికేయపురానికి చెందిన వెంకటయ్య, సాలమ్మల కుమార్తె భారతి(26)ని ఇచ్చి తొమ్మిదేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారుల సంతానం. గణపతి ఇటీవల మద్యం తాగుతూ జులాయిగా మారాడు. అతడి భార్య భారతి పలమనేరు బస్టాండులో పూలమ్ముతూ జీవనం సాగిస్తోంది. అయితే పూలు అమ్మేటప్పుడు మగవారితో చనువుగా మాట్లాడుతుండడంతో గణపతి ఆమెపై అనుమానం పెంచుకుని వేధించాడు. విసిగి వేసారిన భారతి ఏడాదిన్నర క్రితం పిల్లలను భర్త వద్దే వదలి నెల్లూరు జిల్లా కోవూరులో ఉంటున్న తల్లి సాలమ్మ వద్దకు వెళ్లింది. భర్త పిలిచినప్పుడల్లా పలమనేరుకు వచ్చి పిల్లలను చూసి వెళ్తుండేది.


హత్యకు గురైన భారతి(ఫైల్)


నిందితుడు గణపతి (ఫైల్)

అనుమానం పెనుభూతమై..

ఇటీవల కొవ్వూరులో భారతి స్థానికుడు రవితో సన్నిహితంగా ఉందని గణపతికి తెలియడంతో అనుమానం పెంచుకున్నాడు. ఆమెను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. పిల్లలను నీతో పంపుతా.. తీసుకెళ్లాలంటూ జూన్ 27న భార్యను రప్పించాడు. నెల్లూరు నుంచి రైలులో వచ్చిన భారతి చౌడేపల్లెకు వచ్చి భర్తను కలిసింది. మదనపల్లెలో తెలిసిన వారి వద్ద పిల్లలున్నారని చెప్పి బైక్‌లో ఎక్కించుకుని నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె సమీపంలోని ఒక పొలంలోని పశువుల పాక వద్దకు తీసుకెళ్లాడు. వివాహేతర సంబంధంపై నిలదీయడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన గణపతి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి చంపేశాడు. అదే సమయంలో పొలానికి నీళ్లు పెట్టేందుకు వచ్చిన రామాంజనేయులుపైనా కత్తితో దాడి చేశాడు. అతడు కేకలు వేయడంతో గణపతి బైక్‌లో పారిపోయాడు. సాలమ్మ ఫిర్యాదు మేరకు నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలించారు. గణపతిని బైపాస్‌రోడ్డులోని నిమ్మనపల్లె సర్కిల్ వద్ద అరెస్టు చేశారు. అతడి నుంచి కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు.